ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, సీల్‌వెల్ ఫౌండేషన్ సీఎండీ సుబ్బారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ చైర్మన్ కుమారస్వామి సహకారంతో సీల్‌వెల్ ఫౌండేషన్ సీఎండీ సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా టైలరింగ్ శిక్షణను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సీల్‌వెల్ ఫౌండేషన్ 125 కుట్టు మిషన్లు మహిళలకు ఉచితంగా అందజేయనున్నారని తెలిపారు. తన వంతుగా 25 మందికి కుట్టు మిషన్లు అందజేస్తానన్నారు. గత సంవత్సరం 5 వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాబూరావు, రాజేష్ రాయ్, ఉప్పల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్‌లోని ఉద్యమకారుడు శ్రీకాంత్, కూకట్‌పల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణలతో పాటు 50 మంది ముఖ్య నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమైనా ఇప్పటి వరకు పెన్షన్లు పెంచలేదని, అందించాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకొని ఉద్యమకారులు, ప్రజలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, ఎర్రబెల్లి సతీష్ రావు, పెద్ద భాస్కర్, సింగం శ్రీకాంత్, నరసింగ్‌రావు, విష్ణు, రషీద్, రాము, షాద్యుల్లా, రవీందర్, బాలరాజు యాదవ్, రబ్బానీ, నరేందర్ రెడ్డి, సాజిద్, రాంబాబు, వెంకట్‌రావు, షరీఫ్, హమీద్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ: డ్రైనేజీ పైపులైన్ పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ నుంచి గోపాల్ నగర్ మార్గంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు, బాలాజీనగర్ డివిజన్ కైత్లాపూర్ పార్కు వద్ద డ్రైనేజీ లేక రోడ్ల పైన నీరు చేరిన ప్రాంతాన్ని కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, శిరీషతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన డ్రైనేజీ పైపు లైన్ పనుల్లో జాప్యం జరుగుతోందని, అధికారులు ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. బాలానగర్ డివిజన్ కైత్లాపూర్ పార్కు వద్ద డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరడం వల్ల ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీకి కావలసిన నిధులు అంచనా వేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ నగర్‌లో..

మోతీనగర్: డ్రైనేజీ నీరు మైసమ్మ చెరువులోకి రావడం వల్ల దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపార్టుమెంట్‌ల నుంచి వస్తున్న డ్రైనేజీ నీటి పైపులైన్ నేరుగా చెరువులోకి వదలడం వల్ల చెరువు అంతా కలుషితం అవుతూ దోమలు, గుర్రపుడెక్క పెరుగుతుందన్నారు. తద్వారా దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని, అధికారులు వీటిపై దృష్టి సారించి వీలైనంత త్వరగా డ్రైనేజీ పైపులైన్ మళ్లింపు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డీఈ శంకర్, ఏఈ రంజిత్, జలమండలి, సీవరేజ్ బోర్డు మేనేజర్ ప్రభాకర్, మేనేజర్ విలియం ప్రకాష్, డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, నాగుల సత్యం, రాంబాబు, అస్లాం, సలావుద్దీన్, మల్లేష్, జ్ఞానేశ్వర్, రాంరెడ్డి, కృష్ణ, కమల్, రవీందర్ రెడ్డి, తాతారావు, బాబా, మహ్మద్, ముత్యాల దుర్గ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



గోపాల్ నగర్ మార్గంలో డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



రాజీవ్‌గాంధీ నగర్‌లో.. ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులు

విద్యార్థుల చదువుపై నిర్లక్ష్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య

మూసాపేట: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దని, అలా చేస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. బుధవారం కూకట్‌పల్లి కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను క్రమం తప్పకుండా ప్రతి రోజు కళాశాలకు పంపించాలని, వారానికి ఒకసారి సంబంధిత అధ్యాపకులతో విద్యార్థుల చదువు విషయాన్ని అడిగి తెలుసుకోవాలన్నారు. తలిదండ్రులే చదువుపై శ్రద్ధ పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు సన్మానం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని చైతన్య టెక్నో స్కూల్‌లో బుధవారం సమాజ సేవకులను సన్మానించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే సమాజ సేవకులను గౌరవించడం, సన్మానించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో చైతన్య స్కూల్ సిబ్బంది, రంగరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేల సంరక్షణపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని రైతు వేదికలలో మృత్తిక (నేల) సంరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. మానవాళికి ఆహారం అందించే నేలని సంరక్షించుకుంటేనే భావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించే వ్యవసాయాన్ని పండుగలా చేయగలమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను ప్రతి రైతు వేదికలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లాకు చెందిన రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారన్నారు. వ్యవసాయ అధికారులతో సహా కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారులు మట్టి నమూనాలు సేకరించే పద్ధతితో సహా నేల ఆరోగ్య సూచికను ఎలా అర్థం చేసుకోవాలో రైతులకు వివరిస్తారన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి ప్రధాన రహదారి ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి త్వరలోనే నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీకి చెందిన లక్ష్మణ్ గౌడ్ నివాసంలో బుధవారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమీన్‌పూర్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్న సమారాధన నిర్వహించి సన్మానించారు.



అయ్యప్ప స్వాములను సన్మానిస్తున్న నరసింహ గౌడ్ తదితరులు

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు



పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ మాణిక్ రెడ్డి

మోతీనగర్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు కేంద్ర బిందువులని శ్రీ సాయి విక్రమ్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జి.మాణిక్‌రెడ్డి అన్నారు. మోతీనగర్ ప్రధాన రోడ్డులోని శ్రీ సాయి విక్రమ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సాయిబాబా ఆలయ 11వ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, పంచామృతాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, సామూహిక సాయి సత్య వ్రతాలు, మధ్యాహ్న హారతి, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శాలిని, గౌరీ, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడులకు నిరసనగా హిందూ సంఘాల నిరసన



బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని దహనం చేస్తున్న నాయకులు

మోతీనగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ హోమం, అఘాయిత్యాలను నిరసిస్తూ మోతీనగర్ చౌరస్తాలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దారుణాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, నీలం రతన్, ఎర్ర స్వామి, నాగరాజు, మల్లేష్‌గౌడ్, రమేష్ నాయర్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, సద్గుణరెడ్డి, రవిగౌడ్, శోభరాజన్, వాసవి, శ్రీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసానికి తరలిన గ్రూప్–4 అభ్యర్థులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం కార్యక్రమానికి జిల్లా నుంచి గ్రూప్–4 లో ఉత్తీర్ణులైన 511 మంది అభ్యర్థులు తరలివెళ్లారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 11 బస్సులను జెండా ఊపి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారి సాంబశివరావు ప్రారంభించారు. అభ్యర్థుల భద్రత దృష్ట్యా ప్రతి బస్సుకు ఒక కానిస్టేబుల్, ఒక లైజన్ అధికారిని నియమించారు. బస్సుల్లో తరలివెళ్లిన అభ్యర్థులకు మధ్యాహ్న, రాత్రి భోజనాల వసతి కూడా కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, డీటీఓ వెంకటేశ్వర్లు, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ నేషనల్ కాల్స్‌ను డొమెస్టిక్ కాల్స్‌గా మారుస్తున్న సంస్థపై కేసు

కేపీహెచ్‌బీకాలనీ: డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ (డీఓటీ) ప్రమేయం లేకుండా అంతర్జాతీయ కాల్స్‌ను డొమెస్టిక్ కాల్స్‌గా ట్రాన్స్‌ఫర్ చేస్తూ మోసం చేస్తున్న ఓ సంస్థపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. డీఓటీ మార్గనిర్దేశాలను అనుసరించి రిలయన్స్ జియో ఇన్ఫోంకమ్ లిమిటెడ్ (ఆర్‌జేఐఎల్) కేపీహెచ్‌బీ కాలనీలోని ఆర్‌బీ టెక్నాలజీస్‌కు సిప్ కనెక్షన్‌ను అందజేశారు. పరిశీలనలో భాగంగా కొంతకాలంగా డీఓటీ ప్రమేయం లేకుండా మోసం చేస్తున్నారని ఆర్‌జేఐఎల్ గుర్తించింది. డీఓటీ నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌బీ టెక్నాలజీస్ నుంచి ఇంటర్నేషనల్ కాల్స్‌ను డొమెస్టిక్ కాల్స్‌గా మారుస్తూ చీటింగ్ చేస్తున్నారంటూ ఆర్‌జేఐఎల్ ప్రతినిధి పవన్‌కుమార్ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు ఆర్‌బీ టెక్నాలజీపై టెలికమ్యూనికేషన్ యాక్ట్ 42(1), 42(3)కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కంప్యూటర్ పరికరాలు, సర్వర్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రశాంతంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు

రాయదుర్గం: దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలు శేరిలింగంపల్లిలో బుధవారం ప్రశాంతంగా సాగాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థుల ప్రగతిని అంచనా వేసి రాష్ట్రాలకు ర్యాంకింగ్‌ను అందించడానికి ఈ పరీక్షలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా 14 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఎన్ఏఎస్ రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి పర్యవేక్షణలో ఎంఈఓ వెంకటయ్య, రాయదుర్గం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు పరిశీలించారు. ఎంపీపీఎస్ కేశవనగర్ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోపన్‌పల్లితండా, ఎంపీపీఎస్ సిద్ధిఖ్‌నగర్‌లోని పాఠశాలల్లో పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

వృద్ధురాలి అదృశ్యం



అనసూయ

కేపీహెచ్‌బీకాలనీ: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సొసైటీలోని భార్గవ్స్ లక్ష్మీ రెసిడెన్సీలో నివాసం ఉండే ధన్‌రాజ్ నానమ్మ అనసూయకు (90) సంవత్సర కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. యువత స్వయం శక్తితో వ్యాపార, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జ్యూట్ బ్యాగ్ తయారీ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉచిత శిక్షణ ఈ నెల 6 నుంచి 13 రోజుల పాటు కొనసాగనుంది. ఉచిత శిక్షణకు 19 నుంచి 45 సంవత్సరాల వరకు ఉన్న వారు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులతో పాటు 3 ఫొటోలు వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. సందేహాలుంటే 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 ఫోన్ నంబర్లలో సంప్రదించగలరని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు అవార్డుల పంపిణీ

గచ్చిబౌలి: మాదాపూర్ మైండ్‌స్పేస్‌లోని వెస్టిన్ హోటల్‌లో గురువారం సూర్యకాన్ హైదరాబాద్-2024 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈక్యూఎంజీ సీఈఓ ఆనంద్‌గుప్తా తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వార్షిక సోలార్ అవార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీడీసీఎల్ హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ చిలుకమారి చక్రపాణి, ఆదాయపుపన్ను శాఖ హైదరాబాద్ అదనపు కమిషనర్ యాదగిరి, సీఈఓ మాజీ సభ్యుడు జి వీర, సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ జీఎస్ జానకిరామ్, తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ జానియా పాల్గొంటారని వివరించారు.

పురుషుల వాలీబాల్ జట్టు ఎంపిక



ఎంపికైన పురుషుల వాలీబాల్ జట్టు క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ పురుషుల వాలీబాల్ జట్టును సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు డిసెంబర్ 18 నుంచి 22 వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ మెన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్‌లో విక్టరీ ప్లేగ్రౌండ్ వాలీబాల్ చీఫ్‌కోచ్ వినోద్‌కుమార్, వివిధ కళాశాలల నుంచి హాజరైన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

బాలానగర్: బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫతేనగర్ వడ్డెర బస్తీలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేసి గంజాయి విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పార్థీవాడకు చెందిన కవిత (37) తన అనుచరుడు ముస్తఫాహుస్సేన్ (34) ఇరువురు ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి అనుచరుల ద్వారా గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు వారి గృహంపై దాడి చేసి కిలో 500 గ్రాముల గంజాయి, రూ.17 వేల నగదు, 2 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయత్రి, వరలక్ష్మి అనే ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచారుల బైండోవర్

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్, బస్టాప్ ప్రాంతాల్లో వ్యభిచారం నిర్వహించే వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు 6 టీములుగా ఏర్పడి మంగళవారం రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కేపీహెచ్‌బీ బస్టాప్, మెట్రో స్టేషన్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 10 మంది మహిళలను అరెస్టు చేసి కూకట్‌పల్లి ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. ప్రతి నెలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడి ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: యూత్ కాంగ్రెస్ ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా సూర్యవంశం ఎన్నికయ్యారు. 641 ఓట్లతో విజయం సాధించాడు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభ్యున్నతికి తోడ్పడాలని ఆయన సూచించారు.

ప్రజా ప్రభుత్వం కాదు.. ఫాసిస్ట్ ప్రభుత్వం

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే హరీష్‌రావుపై అక్రమ కేసులు
- ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని, ఇది ఫాసిస్టు ప్రభుత్వ పాలన అని ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం గండి మైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేడు విస్మరించారన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నట్టేట ముంచారన్నారు. ప్రజల హామీలపై ప్రశ్నిస్తే రేవంత్ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా మాజీ మంత్రి హరీష్‌రావుపై కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు. చక్రధర్‌గౌడ్ అనే చీటర్ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తారా? అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన చావుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులే కారణం అని నోట్ రాసిపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడని, నేటి వరకు పోలీసులు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హద్దులు దాటుతున్నారని, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై బుల్డోజర్లు ఎక్కిస్తామని అంటున్నా పోలీసులు కేసు నమోదు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే మాజీ మంత్రి హరీష్ రావుపై పెట్టిన బూటకపు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.